క్లుప్తంగా

రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

చొప్పదండి: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు అమ్మాలని తహసీల్దార్ అంబటి రజిత, ఏవో వంశీక్రిష్ణ, ఎస్ఐ ఉపేంద్రచారి కోరారు. పట్టణంలోని డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాక్ రిజిష్టర్లు, బోర్డులు నిర్వహించాలని, ఎప్పటి కప్పుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

వీణవంక: కల్తీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజయ్య, వ్యవసాయ అధికారి గణేశ్ హెచ్చరించారు. మండలంలోని రైతువేదికలో విత్తన డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. నేటినుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, ఏఈవోలు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

గంగాధర: దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు పిలుపు నిచ్చారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో పీఎం మోదీ ఇరవై ఏళ్ల చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని స్థానిక రిటైర్డ్ టీచర్ శుభశేఖర్‌కు అందజేశారు. ముఖ్యమంత్రిగా అందించిన సేవలతో పాటు ప్రధాన మంత్రిగా దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న తీరును, ఆయన ఉపన్యాసాలను పుస్తకంలో పొందుపరిచామని పేర్కొన్నారు. ఇందులోని విషయాలను చదివి ప్రజలకు వివరించాలని సూచించారు. పుస్తకాలను ప్రతి లైబ్రరీలో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్ర మంలో నాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, శ్రీపతి చంద్రశేఖర్, రేండ్ల శ్రీనివాస్, ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, పంజాల ప్రశాంత్, రాజేంద్రప్రసాద్, ఆంజనేయులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి

మానకొండూర్: ఉపాధిహామీ కూలీలకు సకాలంలో డబ్బులను చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో ఉపాధిహామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కూలి గిట్టుబాటు అవుతుందా, డబ్బులు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. వెంట జిల్లా నాయకులు సాయిరి దేవయ్య, కానిగంటి మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన

వీణవంక: మండల కేంద్రంలో దళితబంధు కింద మంజూరైన యూనిట్లను బుధవారం అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇల్లందకుంట, వీణవంక మండలాల క్లస్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండో విడుత దళితబంధు యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు సురేశ్, నాగార్జున ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర సాధనతోనే అభివృద్ధి

వీణవంక: తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని టీహెచ్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య రంగంలో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని, మంత్రి హరీశ్‌రావు కృషి ఎంతో ఉందని కొనియాడారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో లేగదూడ మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్, గొల్లపల్లి సమీపంలో జమ్మికుంట–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు దాటుతున్న దూడను ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో దూడ అక్కడికక్కడే మృతి చెందింది. శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కొడిగూటి శారద ప్రవీణ్‌ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కారు డ్రైవర్‌ను మందలించి రైతుకు రూ.70 వేల నష్ట పరిహారం అందేలా చేశారు.

ఎన్నాళ్లీ పడిగాపులు

- తూకం వేసిన ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమకాని వైనం
- రోజులు గడుస్తున్నా రైతులకు తప్పని ఎదురుచూపు
- అమలుకు నోచుకోని 48 గంటల్లో నగదు జమ హామీ



గంగాధర కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

గంగాధర: ఆరుగాలం శ్రమించి అష్టకష్టాలను ఎదుర్కొని పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని ఆశ పడుతున్న అన్నదాతలకు డబ్బులు ఖాతాల్లో జమయ్యే వరకు పడిగాపులు తప్పడం లేదు. నాట్లు వేసి పంట చేతికందే సమయంలో వరికోత మిషిన్ల కోసం, కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి, ప్రారంభించిన తర్వాత తూకం వేయడానికి, తూకం వేసిన తర్వాత లోడింగ్, రైసుమిల్లులో అన్‌లోడింగ్, చివరికి ధాన్యం డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడతాయోనని ప్రతీ దశలో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతాయన్న ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోవడం లేదు. ధాన్యం అమ్మి ఇరవై రోజులు దాటుతున్న డబ్బులు ఖాతాల్లో పడటం లేదని రైతులు వాపోతున్నారు.

- మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలుకు 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ఐకేపీ ఆధ్వర్యంలో 11, కురిక్యాల సహకారం సంఘం ఆధ్వర్యంలో 11, గంగాధర సహకార సంఘం ఆధర్యంలో 11 కొనుగోలు కేంద్రాలను నిర్వహించారు.
- ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా 1,55,000 క్వింటాళ్ల ధాన్యం తూకం వేశారు. మరో 50 వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేయాల్సి ఉంది.
- మొత్తం తూకం వేసిన ధాన్యంలో సగానికైనా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు.
- కురిక్యాల సహకారం సంఘం ఆధ్వర్యంలో 62 వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేయగా కనీసం రూ. 1.61 కోట్లు చెల్లించాల్సి ఉండగా 25 శాతం మాత్రమే జమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. గంగాధర సహకార సంఘం ఆధ్వర్యంలో 45 వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేయగా యాభైశాతం డబ్బులు జమ కాలేదన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 48వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేయగా సగం వడ్లకైనా నగదు జమ కాలేదు.
- ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడంలో జరుగుతున్న జాప్యంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను సంప్రదించగా రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. త్వరలోనే డబ్బు లు జమవుతాయని, రైతులు తమ వివరాలు అందించడంలో కొంత జాప్యం జరుగుతుంది. తూకం వేసిన వెంటనే రైతులు వివరాలు అందజేయాలని సూచించారు.

ఇరవై రోజులు దాటింది



వడ్లమ్మి ఇరవై రోజులు దాటింది. ఇంతవరకు ధాన్యం డబ్బులు ఖాతాలో జమకాలేదు. 283 బస్తాలు తూకం వేసి ఎటువంటి సమాచారం లేకుండానే కామన్ పేరుతో మూడు బస్తాలు కోత విధించారు. అయినా ఇంతవరకు డబ్బులు రాలేదు.

– రేండ్ల ఎల్లారెడ్డి, కొండన్నపల్లి

చర్యలు తీసుకోవాలి



కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాయగా ధాన్యం తూకం వేసి పదిహేను రోజులైంది. వానాకాలం పనులు ప్రారంభం అవుతున్నాయి.. ఇంతవరకు ధాన్యం డబ్బులు జమకాలేదు. తూకం వేసిన రెండు మూడు రోజుల్లో డబ్బులు జమయ్యేలా అధికారులు చర్యలుతీసుకోవాలి.

– కోల ప్రభాకర్, మల్లాపూర్

తనుగులలో బొడ్రాయి వేడుకలు



గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న వేద పండితులు

జమ్మికుంట: మండలంలోని తనుగులలో బొడ్రాయి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు భూలక్ష్మి, మహాలక్ష్మికి వేద పండితులు వల్లూరి పవన్‌కుమార్ వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలుముల వసంత రామస్వామి, ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం, మండలంలోని మడిపల్లి గ్రామంలో గౌడ కులస్తులు ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఎల్లమ్మ తల్లి బోనాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్, కౌన్సిలర్ బొంగోని వీరన్న, మడిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రమేష్, నాయకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.



మడిపల్లిలో మొక్కులు చెల్లిస్తున్న కౌశిక్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సైదాపూర్ మండలం అభివృద్ధిలో ముందుందని, విద్యా, వైద్యం, సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయని, పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని అన్నారు. కార్యకర్తలను చైతన్య పరిచేందుకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. హుస్నాబాద్‌తో పాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నారదాసు లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు రాజయ్య, సింగిల్ విండో చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

చొప్పదండి: మండలానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రూ. 52.06 లక్షల విలువైన చెక్కులను అందించి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుందని కొనియాడారు. ఎంపీపీ చిలుక రవీదర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, అంబటి రజిత, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సేవలు అభినందనీయం

గంగాధర: గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆర్ఎంపీ, పీఎంపీ మండల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో దాదాపు 4 వందల మంది వైద్య సేవలందించడంతో పాటు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను కలిశారు. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం పట్ల ఎమ్మెల్యేతో పాటు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు మంజూరు

చిగురుమామిడి: మండలానికి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నుంచి ప్యాడీ క్లీనర్‌లు, టార్పాలిన్లు మంజూరయ్యాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ రామోజు రజితకృష్ణమాచారి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. సింగిల్‌విండోకు 12, డీసీఎంఎస్‌కు 5, ఐకేపీకి 3 చొప్పున రూ.12 లక్షలు విలువ చేసే 20 ప్యాడీ క్లీనర్లు, రూ.4.48 లక్షల విలువ గల 280 టార్పాలిన్లు రైతులకు సబ్సిడీపై అందించేందుకు మంజూరయ్యాయని తెలిపారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ చొరవతో మంజూరయ్యాయని వివరించారు. వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త కైలాసం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న హరిసింగ్

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ బుధవారం సందర్శించారు. ఓటరు జాబితాను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల గూర్చి తగు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవి, నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మి, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు పరిశీలన

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణ పనులను బుధవారం జిల్లా వైద్యాధికారి లలితాదేవి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చందు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి 19వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు బుధవారం సందర్శించారు. 26వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని, అర్హులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షలు అనంతరం అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిత్, డిస్ట్రిక్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 6.69 కోట్ల ధాన్యం సేకరణ



చిగురుమామిడిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

చిగురుమామిడి: చిగురుమామిడితోపాటు బొమ్మనపల్లి, ఇందుర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాటు చేశామని, మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ దాదాపు పూర్తి కావచ్చాయని ఏపీఎం సంపత్ తెలిపారు. బుధవారం చిగురుమామిడిలో మాట్లాడారు. రూ. 6.69 కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. బొమ్మనపల్లిలో 178 మంది రైతుల నుంచి 11, 770, చిగురుమామిడిలో 137 మంది రైతుల నుంచి 8,720, ఇందుర్తిలో 258 మంది రైతుల నుంచి 12,420 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని, ఒకటి, రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయన్నారు.

ఎమ్మెల్యే అనుచరులపై కేసు నమోదు చేయాలి

గంగాధర: న్యాయవాది యుగంధర్‌పై దాడిచేసిన ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి మంద రవీందర్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో బుధవారం బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం య నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి రవీందర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయని, ప్రశ్నించిన వారిపై భౌతికదాడులు చేస్తున్నారని అన్నారు. న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కాంపల్లి రాజు, నల్లాల రాజేందర్, పొత్తూరి సురేష్, బంద్రకంటి శామ్యూల్, నెల్లి మహేశ్, అలువాల భూమయ్య, మామిడిపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గంగాధర: ఆర్థికసాయం అందిస్తున్న లచ్చయ్య



జమ్మికుంటలో కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోతిరెడ్డి మల్లయ్య, పద్మ కుటుంబానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ రూ.10 వేలు పంపించగా బుధవారం నాయకులు కుటుంబ సభ్యులకు నగదు అందించారు. మల్లయ్య కూమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోగా సంవత్సరికానికి హాజరై సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సదయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, బుర్ర కుమార్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, మురళి పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన విలాసాగరం నారాయణ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను లచ్చన్న యువసేన అధినేత తూడి లచ్చయ్య పరామర్శించి రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. వెంట యువసేన సభ్యులు ఉన్నారు.

యువతి వివాహానికి పుస్తెమెట్టెలు



పుస్తెమెట్టెలు అందిస్తున్న సుధాకర్

రామడుగు: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన మాడిశెట్టి అరుణ,చంద్రయ్య దంపతుల కూతురు వివాహానికి కరీంనగర్ డైయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలను బుధవారం డైయిరీ చైర్మన్ సుధాకర్ అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాపురెడ్డి, డైయిరీ అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899